క్లుప్తంగా

నిరుపేద విద్యార్థికి ప్రభుత్వ విప్ చేయూత



నగదు అందజేస్తున్న విప్ దంపతులు

ధర్మారం: ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీట్ సాధించిన మండల కేంద్రానికి చెందిన నిరుపేద విద్యార్థి సాయిభార్గవ్‌కు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్–కాంతాకుమారి దంపతులు రూ.56వేలు అందజేశారు. ధర్మారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థికి నగదు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉన్నత చదువులకు సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశంగౌడ్, కొత్త నర్సింహులు, జనగామ తిరుపతి, సలాది చంద్రయ్య, తోడేటి రాజలింగయ్య, ఓరెం చిరంజీవి, పాలకుర్తి సాయి వినిత్, దేవి అఖిల్, కాంపెల్లి రాజేశం, ఈదుల శ్రీనివాస్, ఓడ్నాల శంకరయ్య పాల్గొన్నారు.

మంత్రులకు సన్మానం



సన్మానిస్తున్న అన్నయ్యగౌడ్, పుష్పలత

సుల్తానాబాద్: మండల కేంద్రంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్ రావును సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచులు అంతటి పుష్పలత, అన్నయ్యగౌడ్ దంపతులు సన్మానించారు. శుక్రవారం ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు వెళ్తుండగా సుల్తానాబాద్‌లో మంత్రులను ఆపి సన్మానించారు. మంత్రులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ముస్త్యాల రవీందర్, శ్రీగిరి శ్రీనివాస్, కౌన్సిలర్ రఫీక్, కిషోర్, చంద్రయ్యగౌడ్, సాగర్‌గౌడ్, రామన్న పాల్గొన్నారు.

కెనాల వద్ద భారీ బందోబస్తు

రాజీవ్ రహదారి మొదలుకొని, గ్రామాల్లో ఉన్న రోడ్లపైన కాలువల వెంబడి ఉన్నతాధికారులు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మారుమూల ప్రాంతాల్లో మంత్రుల పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఉండేందుకు ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరామర్శ



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

ఓదెల: కరీంనగర్ ఎంపీడీవో ఆకుల సంజీవరావు, ఓదెల మాజీ సర్పంచు ఆకుల మహేందర్ తండ్రి మరణించాడు. ఓదెలలో శుక్రవారం మృతుడు ఆకుల సాంబయ్య(83) కుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, డాక్టర్ సతీశ్, నాయకులు చింతం మొగిలి, బుద్దె పోశెట్టి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్: కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి మరణించిన, శాశ్వత దివ్యాంగులైన వారికి ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలకు పెంచాలని కోరారు. గీత కార్మికులకు నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి ప్రతీ సొసైటీకి ఐదెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యుత్, గ్యాస్ సబ్సిడీ అమలు చేయండి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో విద్యుత్, గ్యాస్ సబ్సిడీ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరపాలక కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన 6 గ్యారెంటీలకు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న చాలామంది నిరుపేదకు విద్యుత్ సబ్సిడీ, గ్యాస్ సబ్సిడీ అమలు కావడం లేదని తెలిపారు. దరఖాస్తు చేసినా సబ్సిడీ వర్తించడం లేదన్నారు. 2వ డివిజన్ కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, సీపీఎం నాయకులు బిక్షపతి, టి.రవీందర్, కిషన్ నాయక్, ఉప్పులేటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

శానిటేషన్‌పై స్పెషల్ ఫోకస్

- కుక్కల బెడదకు ప్రత్యేక చర్యలు
- సీసీరోడ్ల నిర్మాణంపై దృష్టి
- బల్దియా కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్
- 'సాక్షి ఫోన్‌ఇన్'కు విశేష స్పందన



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం 'సాక్షి' నిర్వహించిన 'ఫోన్‌ఇన్'కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. తాగు నీటి ఇబ్బందులు తొలగించాలని, రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వర్షం నిలిచిందని, లేఅవుట్ కాలనీల్లో సీసీరోడ్లు నిర్మించాలని, బురదమయమైన రోడ్లను శుభ్రం చేయించాలని, దోమలు, కోతులు, కుక్కలు, పందులు పెరిగిపోయాయని ఫోన్ ఇన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ నమోదు చేసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, సునీల్, హెల్త్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

'సాక్షి' ఫోన్‌ఇన్‌కు వచ్చిన ప్రజలు ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా శానిటేషన్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఫోన్‌ఇన్ కార్యక్రమం అనంతరం అధికారులతో కమిషనర్ మాట్లాడారు. దోమల బెడద నివారణకు నిల్వ నీరు లేకుండా, ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని, వర్షాలతో రోడ్లపై నీరు చేరకుండా అప్రమత్తంగా ఉండాలని, మ్యాన్‌హోళ్లపై పైకప్పు పగిలిన వాటిని గుర్తించి కొత్తవి ఏర్పాటు చేయించాలని ఆదేశించారు.

కుక్కలు వెంటపడి దాడి చేస్తున్నాయి. కోతుల బెడద కూడా ఎక్కువగా ఉంది.
– ఇబ్రహీం/లింగమూర్తి/మహేశ్, మార్కండేయకాలనీ, 8వకాలనీ, తిలక్‌నగర్‌డౌన్.
కమిషనర్: కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తాం. ఆంధ్రా నుంచి కోతులను పట్టుకునే వాళ్లను రప్పిస్తాం.

ఇందిరానగర్ కూడలిలోని ప్రధాన రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. వెంటనే చర్యలు తీసుకోండి.
– విశ్వతేజ, ఇందిరానగర్
కమిషనర్: రోడ్డును ఆక్రమించిన వాటిని తొలగిస్తాం. మురుగు, వర్షం నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకుంటాం.

ఎన్టీపీసీలోని ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి శాలపల్లి వరకు రోడ్డు పూర్తిగా చెడిపోయింది.
– మొహ్మద్ రహీమ్, మల్కాపూర్.
కమిషనర్: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

33, 34వ డివిజన్ల పరిధిలో సీసీరోడ్డు నిర్మించాలి.
– బొబ్బిలి సతీశ్‌కుమార్, విఠల్‌నగర్.
కమిషనర్: రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

దుర్గానగర్‌లోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్ ఎదుట సీసీరోడ్డు నిర్మించలేదు.
– రాచకట్ల విజయ, దుర్గానగర్.
కమిషనర్: నగరంలో రోడ్ల నిర్మాణాలకు రూ.20కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. దుర్గానగర్‌లో సీసీరోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

మా కాలనీలో నివాసాల మధ్య నిర్వహిస్తున్న కోళ్లఫాంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
– రవికాంత్, శ్రీనగర్‌కాలనీ.
కమిషనర్: కోళ్లఫాంను పరిశీలించి వివరాలు సేకరించి, నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తాం.

మా ఇంటి దగ్గర ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగాయి.
– గద్దం సత్తయ్య, విఠల్‌నగర్‌క్లబ్.
కమిషనర్: మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తాం.

మా కాలనీలో సీసీరోడ్డు నిర్మించలేదు.
– వెంకటస్వామి, మార్కండేయకాలనీ.
కమిషనర్: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

లక్ష్మీపురంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఓపెన్ డ్రెయిన్ మధ్యలో ఆగిపోయింది.
– ఎండీ.రఫీద్‌హుస్సేన్, 14వ డివిజన్–లక్ష్మీపురం.
కమిషనర్: సమస్య పరిష్కారానికి నేరుగా పరిశీలించి చర్యలు తీసుకుటాం.

32వ డివిజన్‌లోని సీనియర్ సిటిజన్ హాల్ ఎదుట, 2వ డివిజన్ ఇందిరమ్మకాలనీ లో రోడ్లపై నీళ్లు నిలుస్తున్నాయి
– ప్రజ్యుత్/లక్ష్మణ్.
కమిషనర్: రోడ్లపై నీటిని తొలగిస్తాం.

శాలపల్లి, సాయి సేవాసమితి, పీకేరామయ్య కాలనీలోని మినరల్‌వాటర్ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి.
– మామిడి కుమారస్వామి, ఎన్టీపీసీ.
కమిషనర్: ఎన్టీపీసీ సంస్థ అధికారులతో చర్చించి, వినియోగంలోకి తీసుకొస్తాం.

జీఎంకాలనీ, గంగానగర్ మధ్యలో ఉన్న డ్రెయినేజీ సమస్య పరిష్కరించండి.
– సదాకుమార్, జీఎంకాలనీ.
కమిషనర్: సింగరేణి అధికారుల సమన్వయంతో డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తాం.

మంథనిలో భారీ వర్షం



మంథని మండలం విలోచవరంలో రహదారిపై పారుతున్న వరద నీరు



శ్రీపాదకాలనీలో ఓ ఇంటి ముందు చేరిన వర్షపు నీరు



కన్నాలలో కొట్టుకుపోయిన వరినాటు

- రోడ్డుపైకి, లోతట్టు ఇళ్లలోకి చేరిన వరద నీరు
- కొట్టుకుపోయిన వరినాట్లు

మంథని: మంథనిలో రెండురోజుల నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి మున్సిపల్ పరిధిలోని శ్రీపాద కాలనీ, గంగాపురిలోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి నీరు చేరి కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. మంథని ఆర్టీసీ బస్టాండ్‌లోకి నీరు చేరింది. పట్టణంలోని పలు రోడ్లపై వరద ప్రవహించింది. మంథని మండలం విలోచవరం రహదారిపై వరద నీరు పారింది. గ్రామంలోని కొత్త చెరువు మత్తడిపారడంతో పరికివాగు కాజ్‌వే మునిగింది. మండలంలోని సూరయ్యపల్లి–రచ్చపల్లి దారిలో ఉన్న కాజ్‌వేపై నుంచి వరద వెళ్లడంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కొట్టుకుపోయిన వరినార్లు..

సింగరేణి సంస్థ ఓసీపీ–2 మట్టికుప్పల నుంచి భారీ వరద రావడంతో మూడురోజుల క్రితమే వేసిన వరినాట్లు దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు. గ్రామానికి చెందిన గుడిసె రాజయ్య, రాజ్‌కుమార్, అశోక్, సంపత్, వీరయ్య, మల్లారెడ్డితో పాటు సుమారు 15మంది రైతులకు చెందిన 30ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఓసిపి–2 యాజమాన్యం రూ.40వేల చొప్పున పరిహారం చెల్లించాలని గ్రామానికి చెందిన గుడిసె గట్టయ్య డిమాండ్ చేశారు.

మత్తడి దూకుతున్న చెరువులు, కుంటలు

రెండు రోజుల పాటు కురిసిన కుండపోత వర్షంతో మంథని డివిజన్‌లో సరాసరి 92.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంథనిలో 123.2 మి.మీ., కమాన్‌పూర్‌లో 96.2, ముత్తారంలో 72.6, రామగిరిలో 76.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మంథని డివిజన్‌లోని చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో 108 నీటిపారుదల ట్యాంకులు ఉన్నాయి. ఇందులో మంథనిలోని రెడ్డి చెరువు, గుంజపడుగు ఊర చెరువు, సోమన్‌పల్లిలోని మేడి చెరువు మినహా అన్ని చెరువులు, మత్తడి దూకుతున్నట్లు నీటిపారుదల శాఖ డీఈఈ రమేశ్‌బాబు తెలిపారు.

క్వార్టర్లు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

రామగుండం: సింగరేణి క్వార్టర్లలో మెరుగైన సౌకర్యాలు కలిగిన క్వార్టర్లను ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరుతూ శుక్రవారం సింగరేణి కార్మికులు డిప్యూటీ తహసీల్దార్ మల్యాల తిరుపతికి వినతిపత్రం అందజేశారు. బాధిత క్వార్టర్ల సింగరేణి కార్మికులు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో భాగంగా గోదావరిఖని చౌరస్తా సమీపంలో పలు సింగరేణి క్వార్టర్లను తొలగించేందుకు బల్దియా నిర్ణయించింది. అధికారులు హుటాహుటిన క్వార్టర్లను ఖాళీ చేయించి కూలదోయడం సరికాదని, తమకు కొంత సమయం ఇచ్చి ప్రత్యామ్నాయం చూపించాలని కార్మికులు కోరినప్పటికీ తొలుత యాజమాన్యం మొండివైఖరి అవలంభించడంతో హైకోర్టును ఆశ్రయించారు. తమ పిటిషన్‌కు స్పందించిన హైకోర్టు ఆదేశాల మేరకు స్పందించిన సింగరేణి యాజమాన్యం 26 మంది కార్మికులకు ప్రత్యామ్నాయంగా సమీపంలోనే 63 క్వార్టర్లు అందుబాటులో ఉన్న విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకువచ్చింది. వీటిలో తమకు ఇష్టమైన వాటిని గుర్తించి మెరుగైన సౌకర్యాలు కలిగిన క్వార్టర్లను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలని తహసీల్దార్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు.

సంక్షిప్త వార్తలు

హైవేపై నిలిచిన నీరు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణ శివారు రంగంపల్లి వద్ద రాజీవ్‌రోడ్డుపై నీరు నిలిచింది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ సిబ్బందితో కలిసి నీటిని తొలగించేలా చర్యలు చేపట్టారు. నీరు నిలిచిన ప్రాంతాలను తొలగించేందుకు అవసరమైతే జేసీబీ యంత్రాలను వినియోగించాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. ఏఈ సతీశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌ను వేరే బిల్డింగ్‌కు మార్చాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని, వెంటనే వేరే భవనంలోకి మార్చాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, ప్రశాంత్ కోరారు. ఎస్సీ సంక్షేమశాఖ అధికారి నాగలైశ్వర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు.

కార్మికులకు 50రెయిన్ కోట్స్ పంపిణీ

గోదావరిఖనిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ రావికంటి శశిధర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం రామగుండం కార్పొరేషన్‌లోని 50మంది పారిశుధ్య కార్మికులకు లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో జ్యోతిగాంధీ ఫౌండేషన్ నిర్వహణలో 50 రెయిన్ కోట్స్ పంపిణీ చేశారు.

మంత్రుల పర్యటనలో జేబుదొంగలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దరాతుపల్లిలో శుక్రవారం ఆయిల్‌పాం ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రుల పర్యటనలో జేబుదొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. మొట్లపల్లికి చెందిన ఓ రైతు ఎరువుల కోసం వెంట తెచ్చుకున్న రూ.25వేలు, కాంగ్రెస్ నాయకుల జేబులో నుంచి రూ.16వేలు, ఇంకొకరివి రూ.3వేలు దొంగతనం చేశారు.

మంత్రికి కృతజ్ఞతలు

రామగిరి: మండలంలోని లద్నాపూర్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయానికి విద్యుత్ సరఫరా ఏర్పాటుకు సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబుకు శుక్రవారం గౌడ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీవర్ బాధితులు పరీక్షలు చేయించుకోవాలి

జూలపల్లి: గ్రామాల్లో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారు తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండలంలోని వడ్కాపూర్‌లో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. 67 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హెచ్‌వీ వసంత, ఏఎన్ఎంలు సరిత, ఎంఎల్‌హెచ్‌పీ సుస్మిత, కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

పార్టీకి సేవచేసిన వారికి గుర్తింపు

సుల్తానాబాద్: కాంగ్రెస్ పార్టీకి కష్టకాలంలో సేవచేసిన వారికి ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం ఆయన కరీంనగర్ నుంచి చెన్నూరు వెళ్తుండగా సుల్తానాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు ఆపారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్ ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య సత్వరమే పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ శుక్రవారం కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్ ఏరియా, భరత్‌నగర్, ఎస్సీ, బీసీ కాలనీల్లో నల్లా కనెక్షన్ ఉన్నప్పటికీ ఎత్తైన ప్రాంతం కావడంతో నీరు పైకి ఎక్కడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి రూ.8లక్షలు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. దీనిపై కమిషనర్ డివిజన్‌లో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని వినతిపత్రంలో కోరినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలి

కాల్వశ్రీరాంపూర్: ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ)రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్‌కుమార్ మంత్రి పొన్నాల ప్రభాకర్‌గౌడ్‌ను కోరారు. కాల్వశ్రీరాంపూర్‌కు శుక్రవారం వచ్చిన మంత్రికి యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు గుడ్ల శ్రీనివాస్, సొన్నాయిటెంకం చంద్రమౌళి, బాలె శివప్రసాద్, రావి కోటేశ్వర్, ముస్కు అనంతరెడ్డి, వీరగోని రమేశ్, శ్రీమంతుల కొండాల్, మధుకర్, మృత్యుంజయం, మల్లేశ్, సదానందం, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చే పనులు చేపడుతున్నామని మండల పరిషత్ అధికారి సుదర్శన్ తెలిపారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో శుక్రవారం ఆయన పనులను పర్యవేక్షించారు.

ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలి

జ్యోతినగర్: ప్రతీ శుక్రవారం అందరూ డ్రైడే పాటించాలని రామగుండం కార్పొరేషన్ శానిటరీ సూపర్‌వైజర్ సంపత్ అన్నారు. కార్పొరేషన్‌లోని మూడో డివిజన్‌లో శుక్రవారం ఆయన ఆర్పీలతో పాటు పర్యటించారు.

గని ప్రమాద మృతులకు నివాళి



మౌనం పాటిస్తున్న ఉద్యోగులు

గోదావరిఖని/యైటింక్లయిన్‌కాలనీ: ఓసీపీ–2లో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ఉప్పు వెంకటేశ్వర్లు, గాదం విద్యాసాగర్ ఆత్మశాంతి కోసం కార్మికులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. శుక్రవారం ఓసీపీ–1 బేస్ వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుల స్మారకార్థం మౌనం పాటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోల్‌సిటీ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగరపాలక కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. మిగిలిపోయిన ఆహార పదార్థాలు మున్సిపల్ వాహనానికి అందించాలని కోరారు. జ్వర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, కాలువల్లో పూడిక తొలగించి నీళ్లు పారేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డ్రెయినేజీ మ్యాన్‌హోళ్ల పైకప్పు మూతలు పగిలిపోయిన చోట మరమ్మతు చేయించి కొత్త మూతలు అమరుస్తున్నట్లు తెలిపారు. మూతలు లేని మురుగు నీటి కుండీలను గమనిస్తే, వెంటనే నగరపాలక సంస్థ కార్యాలయానికి, హెల్ప్‌లైన్ 96036 66444 నంబర్‌కు తెలియజేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

బస్ డిపో ఏర్పాటు హామీపై హర్షం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటుకు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇవ్వడం సంతోషకరమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బి.సురేశ్‌గౌడ్‌తో పాటు కౌన్సిలర్లు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కరోనా టైంలో సేవ చేయడం తృప్తినిచ్చింది



బదిలీ ఉత్తర్వు అందుకుంటున్న డాక్టర్ శ్రీరామ్

సుల్తానాబాద్: కరోనా సమయంలో సేవలు అందించడం సంతృప్తి కలిగించిందని డాక్టర్ శ్రీనివాస శ్రీరామ్ అన్నారు. సుల్తానాబాద్ నుంచి హుస్నాబాద్‌కు బదిలీపై వెళ్తున్న శ్రీనివాస శ్రీరామ్‌ను శుక్రవారం సన్మానించారు. డాక్టర్ మాట్లాడుతూ సుల్తానాబాద్‌లో పేదలకు సేవ చేయడంలో తృప్తినిచ్చిందని, ట్రాక్టర్ సహకారంతో కరోనాతో చనిపోయిన రోగిని దగ్గరుండి దహన సంస్కారాలు చేయడంతో రాష్ట్ర ఉన్నతాధికారుల సైతం ప్రశంసలు ఇచ్చారని, సుల్తానాబాద్‌లో చేసిన సేవలు జీవితాంతం గుర్తుండిపోతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, సిబ్బంది పవన్ సహా పలువురు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

యైటింక్లయిన్‌కాలనీ/గోదావరిఖని: అమ్మవారి ఆశీస్సులతో రామగుండం ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషిభవన్ రిలే బి కార్మికులు ఆషాడమాసం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన బోనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తాలో అమ్మవారి బోనమెత్తుకొని, పోతురాజుల నృత్యాల మధ్య ఓసీపీ–3 కృషిభవన్ అమ్మవారికి బోనం సమర్పించారు. ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, మేనేజర్ రమేశ్, కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, శంకర్ నాయక్, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, ఐఎన్‌టీయూసీ నాయకులు సత్యనారాయణరెడ్డి, ఎండీ అక్రమ్, కృష్ణ, సంపత్‌రెడ్డి, రాజయ్య, సమ్మయ్య, అవినాష్ పాల్గొన్నారు.

వరదనీరు.. కూలిన కాల్వలు



ఆదిత్య హోటల్ ముందు కూలిన నాలా ప్రహరీ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొన్ని ప్రాంతాలు అతలాకుతం అయ్యాయి. స్థానిక 32వ డివిజన్‌లోని ఎల్బీనగర్‌లో నాలా నుంచి రోడ్డుపైకి చేరిన వరద నీరు సమీపంలోని ఇండ్లలోకి చేరాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. స్థానిక మార్కండేయకాలనీలోని ఆదిత్య రెసిడెన్సీ హోటల్ ముందున్న ప్రధాన నాలాపై నుంచి రోడ్డుపైకి వరద నీరు భారీగా ప్రవహించింది. ఈ ప్రవాహంతో ఆదిత్య హోటల్ ముందు నాలా గోడ కూలిపోయింది. మరోవైపు ప్రహరీ గోడపై నిర్మించిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ వంగిపోయి ప్రమాదకరంగా మారింది. హోటల్ ముందు కల్వర్టుపై భారీ గొయ్యి ఏర్పడింది. శారదానగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ముందు నుంచి ఫైర్‌స్టేషన్ వరకు రోడ్డుపై భారీగా వరద నీరు ప్రవహించింది. ఆస్పత్రి నుంచే భారీగా వరద నీరు సమీప నివాసాల్లోకి వరద నీరు ప్రవహిస్తోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక కుటుంబాలు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు విన్నవించుకున్నారు. గాంధీనగర్, మార్కండేయకాలనీ తదితర ప్రధాన రహదారులపై వరద నీరు భారీగా చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అసంపూర్తి వంతెనతో ప్రజల ఇక్కట్లు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో శిథిలావస్థకు చేరిన పురాతన వంతెనను కూలదోసి నూతనంగా హైలెవల్ వంతెన నిర్మాణం చేపడుతున్నారు. వంతెన నిర్మాణ దశలో ఉంది. గ్రామీణ ప్రజల సౌకర్యార్థం వంతెన పక్కన లోతట్టు ప్రాంతంలో తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు చేరి రాకపోకలకు ఆటంకం కలిగింది. పలు ద్విచక్రవాహనాలు అదుపు తప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సంబంధిత ఎంపీడీవో ఎంఏ.అలీంతో పాటు ఆయన సతీమణి మనాలిఠాకూర్‌ను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఎంపీడీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థానికుల సహకారంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. బ్రాహ్మణపల్లి గ్రామ ప్రముఖులు మడ్డి తిరుపతిగౌడ్, వెంకటేశ్‌గౌడ్, గాదె సుధాకర్ ఉన్నారు.

శానిటేషన్ కార్మికులకు బయోమెట్రిక్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని శానిటేషన్ విభాగం కార్మికులకు ఎట్టకేలకు బయోమెట్రిక్ మిషన్లు ప్రవేశపెట్టనున్నారు. శుక్రవారం 12 జోన్లలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేలిముద్రలు, వారి ఫేస్‌లను సూపర్‌వైజర్లు బయోమెట్రిక్ మిషన్లలో అప్‌లోడ్ చేయించారు. బల్దియాలోని శానిటేషన్ పనితీరుపై ఇటీవల కలెక్టర్ ఆరా తీయడంతోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ కూడా ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్మికులకు బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన 13 బయోమెట్రిక్ మిషన్లను తెప్పించిన అధికారులు, ఆ మిషన్లలో కార్మికుల వివరాలు, వారి వేలిముద్రలు, ఫేస్‌లను అప్‌లోడ్ చేశారు.